కర్ణాటక సెంట్రల్ వర్సిటీలో విద్యార్థులకు మంచి అవకాశాలు

● ఒక పరీక్షతో యూజీలో 14 కోర్సులు : ప్రొ.లింగమూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ.లింగమూర్తి

హైదరాబాద్ సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని పేద, మధ్య తరగతి విద్యార్థులు కర్ణాటక హెచ్‌సీయూలో తక్కువ ఖర్చుతో చదువుకునే అవకాశాలు కల్పిస్తుందని కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ అసోషియేట్ ప్రొ.లింగమూర్తి అన్నారు. కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీలో విదార్థులకు అందిస్తున్న కోర్సులపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వర్సిటీ ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 25రాష్ట్రాల నుంచి కర్ణాటక వర్సిటీలో విద్యార్థులు చదువుతున్నారని, తెలంగాణ రాష్ట్రం నుంచి తక్కువ సంఖ్యలో విద్యార్థులకు వస్తున్నారని, వర్సిటీపై అవగాహన కల్పించడంతో పాటు అవకాశాలను ఇక్కడి విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు. ఎన్‌టీఈ కామన్ పరీక్ష ద్వారా కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు అర్హత సాధించవచ్చని, యూజీలో 14 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వచ్చిన ప్రొ. భట్టు సత్యనారాయణ ప్రస్తుతం కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీకి వీసీగా పనిచేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అతిసమీపంలో వర్సిటీ ఉందన్నారు. అర్హత పరీక్ష ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రాసుకోవచ్చని, ఆన్‌లైన్‌లో మార్చి 26 వరకు యూజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రొ.గోవింద్ మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థులకు కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రొ.డా.సురేష్, ప్రొ.డా.అంజనేయులు పాల్గొన్నారు.

7,150 మంది పిల్లలకు గుండె సర్జరీలు

● హృదయ ఫౌండేషన్‌ను అభినందించిన జయేష్‌రంజన్


చిన్నారులతో వైద్య ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు గుండె సర్జరీలో చేయూత అందిస్తున్న హృదయ ఫౌండేషన్‌ను కార్పొరేట్లు, ఐటీ కార్పొరేట్ రంగాలు ప్రోత్సహించాలని ఐటీ అండ్ ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ పిలుపునిచ్చారు. టీ హబ్ వద్ద శనివారం రాత్రి హృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7,150 సర్జరీలను పూర్తి చేసిన సందర్భంగా అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జయేష్‌రంజన్ మాట్లాడుతూ.. పెరుగుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి వ్యవస్థీకృత మద్దతు అందించడం అవసరమన్నారు. 2005లో 'హృదయ క్యూర్ ఎ లిటిల్ హార్ట్'ను డాక్టర్ గోపీచంద్ మన్నంతో పాటు ఇతర భావాలు గల వ్యక్తులు స్థాపించి సేవలు అందిస్తున్నారని తెలిపారు. జైరాజ్‌కుమార్, డాక్టర్ నాగార్జున పొనుగోటి నేతృత్వంలో పుట్టుకతో వచ్చే గుండె జబ్బులతో బాధపడే వారందరికీ సహకరిస్తున్నారన్నారు. హృదయ ఫౌండేషన్, స్టార్, ఇన్నోవా ఆస్పత్రుల్లో 7,150 మందికి పైగా పిల్లలకు వైద్య చికిత్సలు పొందేందుకు సహాయం చేసిందన్నారు.

కట్టమైసమ్మ బస్తీలో కబ్జా


రాత్రికి రాత్రే వెలిసిన నిర్మాణం

గాజులరామారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అధికారులు కబ్జాదారులను కట్టడి చేస్తున్నా కూడా... వారు మాత్రం ప్రభుత్వ భూమి కనబడితే రాత్రికి రాత్రే పాగావేస్తూ... తెల్లవారేసరికి రూములు నిర్మిస్తున్నారు. గాజులరామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్, కట్టమైసమ్మ బస్తీలో ప్రభుత్వ సర్వేనంబర్ 329/1లో ఓ పార్టీకి చెందిన నాయకుడినంటూ రాత్రికి రాత్రే ఒక రూం ఏర్పాటు చేసి, అది పాతదిగా కనిపించేలా రంగులు అద్దాడు. తెల్లవారేసరికి రూం దర్శనం ఇవ్వడంతో కట్టమైసమ్మ బస్తీవాసులు అవాక్కయ్యారు. మండల రెవెన్యూ అధికారులు ఇటీవల ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసి కబ్జాదారులపై కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి కొంత కాలం కబ్జాలు ఆగినా ఎక్కడో ఒకమూల రాత్రి సమయాల్లో గదులు నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను పలువురు వేడుకొంటున్నారు.

గ్రూప్స్ ఖాళీలను పెంచాలి

● ఆదివారం రాత్రి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభం



నిరాహారదీక్షలో పోటీపరీక్షల అభ్యర్థులు

చిక్కడపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1, 2, 3 ఉద్యోగాల ఖాళీల సంఖ్యను పెంచి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఈసందర్భంగా నిరాహారదీక్ష చేస్తున్న అశోక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లతో పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. గ్రూప్-1 750, గ్రూప్-2 3వేల ఖాళీలున్నాయని, వాటికి పరీక్షలు నిర్వహించాలన్నారు. మెగా డీఎస్సీ అని చెప్పిన ప్రభుత్వం.. టెట్ పరీక్షను నిర్వహించకుండా డీఎస్సీ ఎలా చేపడుతుందని ప్రశ్నించారు. డీఎస్సీ ఉద్యోగాల సంఖ్యను పెంచడంతో పాటు టెట్ పరీక్షను నిర్వహించాలన్నారు. తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం చేసే జీవో 46ను తొలగించాలని డిమాండ్ చేశారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి


సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

బాలానగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళా అభ్యుదయం కోసం సావిత్రి బాయిపూలే చేసిన సేవలు అనిర్వచనీయమని కూకట్‌పల్లి దళిత ఐక్యవేదిక సభ్యులు అన్నారు. సావిత్రబాయి వర్ధంతి సందర్భంగా వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు ఎడ్ల ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కవిత, ఉపాధ్యక్షుడు రాజు, అనిల్, ప్రభాకర్, గణేశ్, నర్సింహ, సత్యనారాయణ పాల్గొన్నారు.

గురుకులాల రెజ్లర్లకు 14 పతకాలు


రెజ్లర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు పది స్వర్ణాలు, 4 రజతాలు సహా మొత్తం 14 పతకాలు కొల్లగొట్టారు. రెండ్రోజులుగా యాకత్‌పురాలో జరుగుతున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. సచిన్, ప్రకాష్, ధర్మతేజ, విక్రమ్, నదిత్‌రాజ్, ఉపేందర్, వికాస్ లావణ్య, శిరీష, రిషిత, ప్రణీత స్వర్ణాలు, అక్షయ్, అర్చన, సృజన, సంతోషి రజత పతకాలు సాధించారు. వీరిని గురుకులాల క్రీడాధికారి రామ్‌లక్ష్మణ్ అభినందించారు.

ఆఖరి మ్యాచ్‌లో హైదరాబాద్ ఓటమి


పోటీల్లోని దృశ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ సీజన్-3ను హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు ఓటమితో ముగించింది. ఈ సీజన్ ఆఖరి మ్యాచ్‌లో హైదరాబాద్ 0-3తో కొచ్చి బ్లూ స్పైకర్స్ చేతిలో ఓడి, పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. హైదరాబాద్ 12-15, 12-15, 11-15తో వరుస సెట్లలో పరాజయం పాలైంది. ఈ సీజన్‌లో హైదరాబాద్ ఆడిన ఎనిమిదింట్లో ఒక్క మ్యాచ్‌లోనే గెలవడం గమనార్హం.


ఆల్విన్‌కాలనీలో సన్మానం అందుకున్న మహిళలతో ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్


ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లో సన్మానం అందుకున్న మహిళలతో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్


లులు మాల్‌లో అవార్డు గ్రహీతలతో అతిథులు

మహిళలను గౌరవించాలి

హైదర్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆల్విన్ కాలనీలోని నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై శానిటేషన్ సిబ్బంది, ఆశావర్కర్లు, సమాజానికి సేవ చేస్తున్న మహిళలను సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి మరింత ముందుకెళ్లాలని ఆయన అన్నారు. తమ పిల్లల కోసం సమయం కేటాయించి వారి భవిష్యత్‌కు పునాది వేయాలని సూచించా రు. కార్యక్రమంలో బాలమిత్ర స్కూల్ కరస్పాండెంట్ ప్రత్యూష, సెన్సార్ బోర్డు సభ్యులురాలు స్రవంతి, మహిళ నాయకులు ద్రాక్షాయిని, శ్యామల, స్రవంతి, జ్యోతి, అనూష, అనిత, మునిషా, సత్య పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లో...

ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లో ఎంఎల్ఎన్ గార్డెన్స్‌లో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను ఆయన సన్మానించారు. మహిళలను గౌరవించడం మనందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వండర్ ఉమెన్ అవార్డ్స్ ప్రదానం

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శ్రీ హస్తినా మహిళా మండలి, లులు మాల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం లులు మాల్‌లో నిర్వహించారు మహిళా దినోత్సవ వేడుకలో వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళలను గుర్తించి లులు వండర్ ఉమెన్ అవార్డ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలను అభినందించారు. కార్యక్రమంలో శ్రీ హస్తినా మహిళా మండలి వ్యవస్థాపకురాలు డా.ఎర్రం పూర్ణశాంతి, తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఇంటిలిజెన్స్ ఎస్పీ శిరీష రాఘవేందర్, రీజనల్ పీఎఫ్ కమిషనర్-2 డీజేకే పావనీ, వర్ధమాన నటీమణులు శ్రీలు, మీనా వాసు, నాగమణి, లులు మాల్ రీజనల్ డైరెక్టర్ అబ్దుల్ సలీం హసన్, రీజనల్ మేనేజర్ అబ్దుల్ ఖదీర్, మాల్ మేనేజర్ ఏజిల్ అరసన్ తదితరులుపాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

మియాపూర్: మాదాపూర్ డివిజన్ గోకుల్‌ప్లాట్స్‌లో ఆదివారం మహిళా కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులను సన్మానించి బహుమతులు అందజేశారు. మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, నాగేశ్వరరావు, వీరందర్‌గౌడ్, మన్నేపల్లి సాంబశివరావు, రాజేష్, శ్రీనివాస్, ప్రసాద్, లక్ష్మి, అనిత, భవాని, చంద్రకళ, శిరీష, విజయ పాల్గొన్నారు.


గోకుల్‌ప్లాట్స్‌లో పారిశుధ్య కార్మికులకు బహుమతులు అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

సమతానగర్‌లో..

ఓల్డుబోయినపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముగింపు సందర్భంగా ఓల్డుబోయినపల్లి సమతానగర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ప్రముఖ సైక్రాటిస్ట్ హిప్నోపద్మ కమలాకర్ సైక్రాటిస్ట్ హాజరై స్లైడ్ షో ద్వారా ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. మహిళలకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా సబ్ కమిటీ కన్వీనర్ సదాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈపోటీల్లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి గొట్టిపాటి నాగేశ్వర్‌రావు, సహాయక కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు పాల్గొన్నారు.



సమతానగర్‌లో బహుమతులు అందుకుంటున్న విజేతలు


అవార్డు అందుకున్న చందన

చందనకు గ్రాండ్ క్వీన్స్‌గ్లోబల్ లీడర్‌షిప్

గచ్చిబౌలి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నల్లగండ్ల అపర్ణసరోవర్‌కు చెందిన చందనకు అత్యుత్తమైన గ్రాండ్ క్వీన్స్ గ్లోబల్ లీడర్‌షిప్ లభించింది. లయన్స్ క్లబ్ గ్రాండ్ క్వీన్స్‌క్లబ్ సభ్యులు చందనకు అవార్డును అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు డాక్టర్ సౌరబ్ సురేఖ, రూపసురేఖలు ఈ అవార్డులను 2020 నుంచి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లో మహిళలను గుర్తించి ఇస్తున్నారు. గచ్చిబౌలిలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో చందనను అవార్డుతో సత్కరించారు. గచ్చిబౌలి నల్లగండ్లకు చెందిన చందన 20 సంవత్సరాలుగా సమాజంలో జరుగుతున్న చెడును రూపుమాపేందుకు కృషిచేస్తున్నారు. గోదావరి జిల్లాలో జరిగే ప్రభలతీర్థం పల్లె జాతరను కూడా హైదరాబాద్‌లోని అపర్ణ సరోవర్‌లో నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. వీధి నాటకాలు స్వయంగా తానే రచించి సుమారు 40నుంచి 50 మంది కళాకారులతో వివిధ ప్రాంతాల్లో నాటకాల ను కూడా ప్రదర్శిస్తున్నారు. ఆమె చేస్తున్న సేవలను గుర్తించిన లయన్స్‌క్లబ్స్ వారు 2024లో ఈ అవార్డు ఇచ్చి సత్కరించారు. ఈసందర్భంగా అవార్డు గ్రహీత చందన మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషంగా ఉందని, అవార్డు తనపై మరింత బాధ్యను పెంచిందన్నారు.

రాజకీయ లబ్ధికోసం చేయొద్దు : ఎమ్మెల్యే కృష్ణారావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసం ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో కూకట్‌పల్లి డివిజన్‌కు చెంది న వివిధ కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు, కాలనీవాసులతో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కొనసాగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ప్రజలను ఇబ్బందులకు గురి చేసేలా జరుగుతున్న పరిణామాలపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్ల పనులను పరిష్కరించేలా కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరాహారదీక్ష చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు, నాయకులు బొట్టు విష్ణు పాల్గొన్నారు.

రాజయోగ మెడిటేషన్ సేవలు అభినందనీయం


రాజయోగ మెడిటేషన్ సెంటర్ ఓంశాంతి పతాకావిష్కరణలో బండి రమేష్, జగదీశ్వర్‌గౌడ్, నాయకులు

వివేకానందనగర్‌కాలనీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాజయోగ మెడిటేషన్ సెంటర్ నిర్వాహకులు ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ వివేకానందనగర్‌కాలనీలోని రాజయోగ మెడిటేషన్(ఓంశాంతి) సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన త్రిమూర్తి శివ్ జయంతి వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఓంశాంతి సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఓంశాంతి పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శేరి సతీష్‌రెడ్డి, సాధు ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్ మేకల, కల్పనగౌడ్, బాషిపాక యాదగిరి, బి.కె.సరోజినీ బహెన్, జ్యోతి బహెన్, కల్పన బహెన్, పద్మ, విద్య తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన రన్


బైక్ రైడ్‌ను ప్రారంభిస్తున్న అనిల్ కుమారు, డాక్టర్ అనుపమ

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి, హార్లీ డేవిడ్సన్ బైకర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బైక్ రైడ్‌ను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీ అనిల్ కుమారు, సీఐఐ ఐడబ్ల్యూఎన్ చైర్ పర్సన్ డాక్టర్ అనుపమ పండూరు జెండా ఊపి ప్రాంభించారు. ఆదివారం హైటెక్ సిటీలోని మెడికవర్ ఆస్పత్రి వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ఉమె న్ చైల్డ్ ఆస్పత్రి, బేగంపేట మెడికవర్ ఆస్పత్రి వరకు వెళ్లి, తిరిగి హైటెక్ సిటీకి చేరుకుంది. కిడ్నీ వ్యాధుల గురించి ప్రజల్లో చైతన్య కలిగించడానికి, కిడ్నీ వ్యాధిని అశ్రద్ధ చేయరాదనే ఉద్దేశ్యంతో, కిడ్నీల రక్షణే అందరి ధ్యేయమనే నినాదంతో ఈ ర్యాలీని నిర్వహించినట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమం చేపట్టడంపై అనిల్ కుమారు ఆస్పత్రి వర్గాలను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనుపమ పండూరి మాట్లాడుతూ... మారిన జీవన శైలి, సరైన పోషకాలు లేని ఆహారం తీసుకోకపోవడం, సమయానికి తినకపోవడం, నీరు ఎక్కువగా తాగకపోవడం, వ్యాయామం చేయకపోవడం కిడ్నీ సమస్యలకు కారణాలవుతున్నాయని వివరించారు. డాక్టర్ కమల్ కిరణ్ మాట్లాడుతూ దేశ జనాభాలో 10శాతం మంది దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్నారని, క్రానిక్ కిడ్నీ డిసీజ్ జనాభాలో 25 శాతం మందిని ప్రభావితం చేస్తోందన్నారు. మధుమేహం, రక్తపోటు సీకెడి వ్యాప్తికి ప్రధాన కారణమన్నారు. అధిక రక్తపోటు, వయోజన జనాభాలో దాదాపు 30శాతం మందిని ప్రభావితం చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైద్యులు అరుణ్ కుమార్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థపరులకే ప్రజలు ఓటు వేస్తారు

● మాజీ మంత్రి ఈటల రాజేందర్

మారేడ్‌పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంకీర్ణ ప్రభుత్వాలకు ఆస్కారం లేదని మాజీ మంత్రి బీజేపీ నాయకులు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మహేంద్రహిల్స్ త్రిమూర్తికాలనీలో సీనియర్ నాయకులు వి.నర్సింగరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 273 సీట్లు ఇచ్చి సంకీర్ణ రాజకీయాల శిఖరానికి పాతర వేసి ఒక స్టేబుల్ గవర్నమెంట్ అందించిందన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసిన ఘనత, అయోధ్య రామమందిర నిర్మాణంలో నరేంద్రమోదీ చట్టాలను, వర్గాలను గౌరవిస్తూ, తీసుకున్న నిర్ణయం ప్రపంచ దేశాలు సైతం ప్రశంసించాయని ఆయన తెలిపారు. కరోనా తొలిదశలో మహేంద్రహిల్స్ నివాసికి రావడం కలకలం రేపిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో తాను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండి రాష్ట్రానికి అనేక సేవలు అందించినట్లు తెలిపారు. ప్రజలు ఇచ్చిన గ్యారెంటీలన్నీ అందించాలని కోరారు. తాను ఎప్పుడు ఏ ఒక్క నాయకుడిని విమర్శించలేదని తెలిపారు. మాజీ సీఎం గంటల తరబడి స్పీచులు ఇస్తూ తానే అంతా చేస్తున్నానంటూ చెప్పుకున్న ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించిన విషయాన్ని మర్చిపోవద్దని హెద్దేవా చేశారు. ప్రధాని మోదీ మనదేశం, మన అభివృద్ధి అంటూ అనేక పెద్ద నగరాలకు వేల కోట్లలో నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. అధిక జనాభా కలిగిన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జి.రామకృష్ణ, కార్పొరేటర్ కొంతం దీపిక, సీనియర్ నాయకులు శ్రీగణేష్, వి.నర్సింగరావు, టోపి శంకర్, విజయానంద్, భానుక మల్లికార్జున్, వీరయ్య, డాక్టర్ బీటీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ రాజును కలిసిన ప్రైవేట్ పాఠశాలల నూతన కమిటీ సభ్యులు

ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ ప్రైవేట్ పాటశాలల అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు రంగారెడ్డి జిల్లా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంబీపూర్ రాజును ఆయన కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో చైర్మన్ శివయ్య, వైస చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మేడ్చల్ జిల్లా కో-ఆప్షన్ సభ్యులు వర ప్రసాద్, నూతన అధ్యక్షుడు చింతల మహేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయం


ఆలయ నిర్మాణ ప్లాన్‌ను పరిశీలిస్తున్న రాజేశ్వర్‌రావు

ఫతేనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావును ఆయన నివాసంలో ఆదివారం ఫతేనగర్ డివిజన్ ప్రభాకర‌రెడ్డినగర్ బస్తీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా చేపడుతున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ విషయంపై ఆయన బస్తీ వాసులతో చర్చించారు. ఆలయ నిర్మాణానికి కపిల్‌గుప్తా ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ బాకీ, దత్తు, సాగర్, రాంరెడ్డి, విష్ణు, శ్రీనివాస్, రాంచందర్, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శిల్పా అవెన్యూలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ప్రారంభించారు. వేసవిలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ పిలుపునిచ్చారు. తొలిరోజు మజ్జిగను పంపిణీ చేశారు. మూగజీవులు, పక్షులకు కూడా వేసవిలో ప్రజలు ఇళ్ల ముందు, ఇళ్లపైన నీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభాకర్, ఉదయ్, రాజేష్, గంగిరెడ్డి, వెంకట్, నారాయణరెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను స్టాండింగ్ కమిటీలో ప్రస్తావించి సత్వర పరిష్కా రానికి కృషిచేస్తామని జీహెచ్‌ఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యు లు, మాయపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. జీహెచ్‌ఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన ఆయనను ఆదివారం ఏఎస్‌రాజునగర్, జేపీఎన్‌నగర్ కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల నిఘాలో కాలనీలు సురక్షితం


సీఐ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న ముజీబ్, ఖాదర్

బాలానగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల నిఘాలోనే బస్తీ సురక్షితంగా ఉంటుందని బోయినపల్లి సీఐ లక్ష్మీనారాయణ బాలానగర్ డివిజన్ దిల్‌కుష్‌నగర్ బస్తీ వాసులకు సూచించారు. ఆదివారం బస్తీ నూతన కమిటీ ఆహ్వానం మేరకు బస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని బస్తీ వాసులకు సీసీ కెమెరాల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం దిల్‌కుషనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ముజీబ్, జనరల్ సెక్రెటరీ మహ్మద్ ఖాదర్ సీఐని శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

జనసేన రక్తదాన శిబిరం

చందానగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం చందానగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్‌థెరిసా బ్లడ్‌సెంటర్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాకులు ఇందుమతి, ఇన్‌చార్జి డాక్టర్ మాధవరెడ్డి, పార్టీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

16 నుంచి పికిల్‌బాల్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈనెల 16, 17వ తేదీల్లో మాదాపూర్‌లోని గేమ్ పాయింట్‌లో పికిల్‌బాల్ చాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నారు. పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్, 35 ప్లస్ కేటగిరీలో పోటీలు జరుపుతున్నారు. ఆసక్తి గలవారు ఈనెల 13వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. మరిన్ని వివరాల కోసం 7032777333లో తెలుసుకోగలరు.

కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి

● నలుగురి అరెస్ట్, ఒకరు పరారీ

దుండిగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కోడిపందేలు ఆడుతున్న స్థావరంపై మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేసి నిందుతులను పేట్‌బషీర్‌బాగ్ పోలీసులకు అప్పగించారు. దేవరాంజల్ గ్రామంలోని ఓ ఇంట్లో రహస్యంగా కోడిపందేలు ఆడుతున్న తోట శ్రీనివాస్, భాను ప్రకాష్‌రెడ్డి, రాజగోపాల్‌కృష్ణ, రాజును ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. సురేష్ పరారీలో ఉన్నారు. వీరి నుంచి మూడు పందెం కోళ్ళు, మూడు సెల్ ఫోన్లు, 20 కోడికత్తులు, రూ. 18,410 స్వాధీనం చేసుకున్నారు. వారిని పేట్ బసీరాబాద్ పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్ తన్నూ ఖాన్‌పై కేసు

యుసుఫ్‌గూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నాలాపై రేకుల షెడ్ వేసి దానిలో పలు రకాల పక్షులు, జంతువులు పెంచుతూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్న రౌడీ షీటర్ మొహ్మద్ తన్వీర్ ఖాన్ అలియాస్ తన్నూఖాన్‌పై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్‌ల కింద కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ తవక్కల్‌నగర్‌కు చెందిన తన్నూఖాన్ నిహ్రా అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న వరనీటి నాలాపై రేకుల షెడ్ నిర్మించి దానిలో గొర్రెలు ఆవులు, కోళ్లు, బాతులు తదితర జీవులను పెంచటంతో పాటు అక్కడ క్యారమ్ బోర్డు, జిమ్ పెట్టి స్థానికంగా కుర్రాళ్లను పోగు చేస్తున్నాడు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఖైరతాబాద్ సర్కిల్-17 ఉప పట్టణ ప్రణాళిక అధికారి అబ్దుల్ వహీమ్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో రౌడీ షీటర్ తన్నూఖాన్‌పై పలు సెక్షన్‌లపై కేసు నమోదు చేశారు. కాగా తన్నూ ఖాన్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086, పున్నారావు: 9985921366